




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక  PEN POWER TELUGU DAILY  ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 11  సంచిక : 39  పేజీలు :12  సంపాదకులు : గంట్యాడ అప్పారావు  ప్రచురణ : ఒంగోలు  మంగళవారం 15 అక్టోబర్ 2024  వెల : 5/-రూ॥

VOLUME :11  ISSUE : 39  PAGES :12  EDITOR : GANTYADA APPARAO  PUBLISHED :ONGOLE  TUE 15 OCTOBER 2024  PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelluru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur







## అమరావతిలో రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్

### చంద్రబాబు కీలక నిర్ణయం

- మెంటార్ స్టార్టప్స్ కోసం టాటా ఇన్నొవేషన్ హబ్
- స్టార్టప్స్ ను మెంటార్ చేయనున్న ప్రముఖ బిజినెస్ గ్రూప్స్
- రాష్ట్రంలోని ఐదు జోనల్ సెంటర్లతో హబ్ అనుసంధానం



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే... మరోవైపు రాష్ట్రాన్ని పారిశ్రామికంగా పరుగులు పెట్టించేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా అమరావతిలో రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ను ఏర్పాటు చేయాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. పారిశ్రామిక అభివృద్ధి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ డ్రాఫ్ట్ పై ఈరోజు ఆయన సంబంధిత శాఖల మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో టాటా ఇన్నొవేషన్ హబ్ గురించి ప్రకటించారు.

వివరాలు 2లో..

# చంద్రబాబు నాకు స్ఫూర్తి..

## ఆయన అనుభవాన్ని వాడుకోకపోతే తప్పు చేసిన వాళ్లమవుతాం: పవన్ కల్యాణ్

- చంద్రబాబు అనుభవం ఏపీకి బలమన్న పవన్ కల్యాణ్
- అధికారులు పారదర్శకంగా పని చేయాలని హెచ్చరిక
- చంద్రబాబు నాయకత్వంలో ఏపీకి మంచి రోజులు వచ్చాయని వ్యాఖ్య
- పల్లెల్లో వెలుగులు నిండాలన్న డిప్యూటీ సీఎం
- రోడ్ల పనులు సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా ప్రణాళికలు రచించామన్న పవన్




పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న అపారమైన అనుభవం ఆంధ్రప్రదేశ్ కు ఎంతో బలమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎంతో అనుభవం ఉన్న నాయకుడు అవసరమని... చంద్రబాబు వంటి నాయకుడి అనుభవాన్ని వాడుకోకపోతే తప్పు చేసినవాళ్లమవుతామని చెప్పారు. అందుకే టీడీపీతో కలిసి కూటమిగా ఏర్పడ్డామని అన్నారు. ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఎన్నో దెబ్బలు తిన్నామని... తట్టుకుని నిలబడ్డామని చెప్పారు. పరిపాలనలో చంద్రబాబు తనకు స్ఫూర్తి అని అన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో పల్లె పండుగ కార్యక్రమాన్ని పవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వాన్ని పదేపదే విమర్శించడం తనకు ఇష్టం ఉండదని ఈ సందర్భంగా పవన్ అన్నారు. ఎంతో పారదర్శకంగా తమ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని చెప్పారు. ప్రభుత్వ అధికారులు కూడా పారదర్శకతతో పని చేయాలని సూచించారు. ఏ అధికారి అయినా తప్పు చేస్తే క్షమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలంతా బాగుండాలనేదే తమ ఆకాంక్ష అని డిప్యూటీ సీఎం చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు రావాలని, పల్లెల్లో వెలుగులు నిండాలని అన్నారు. ఇవన్నీ జరగాలంటే వైసీపీ ప్రభుత్వం పోవాల్సిన అవసరం ఉందని... ఆ పార్టీని ఓడించేందుకు గట్టిగా కృషి చేశామని చెప్పారు. చంద్రబాబు బలమైన నాయకత్వం వల్ల రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని అన్నారు. పరిపాలన వేరు, రాజకీయాలు వేరని చెప్పారు.

3 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు పవన్ శంకుస్థాపన చేశారు. సంక్రాంతి నాటికి రోడ్ల పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రచించామని ఆయన చెప్పారు. అందుబాటులో ఉన్న ఉపాధి నిధులతో బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు కూడా ముందుకొస్తున్నారని చెప్పారు. గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాల ప్రకారం పంచాయతీ పనులు కొనసాగుతాయని అన్నారు. రూ. 4,500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల పనులు చేస్తున్నామని చెప్పారు.

## ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి

- డారన్ ఏస్‌మొగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఏ రాబిన్‌సన్‌ను వరించిన నోబెల్
- సంస్థల ఏర్పాటు, దేశాల మధ్య సంపదలో అసమానతలపై అధ్యయనం
- ఆల్ఫ్రెడ్ నోబెల్ జ్ఞాపకార్థం నోబెల్ బహుమతి అందజేత



పెన్ పవర్ డెస్క్:ఆర్థిక శాస్త్రంలో ముగ్గురిని నోబెల్ బహుమతి వరించింది. డారన్ ఏస్‌మొగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఏ రాబిన్‌సన్‌కు 2024 సంవత్సరానికి గాను నోబెల్ బహుమతిని ప్రకటించారు. సంస్థల ఏర్పాటు, దేశాల మధ్య సంపదలో అసమానతలపై చేపట్టిన అధ్యయనానికి గానూ వీరికి

వివరాలు 2లో..

## పొన్నవోలుకు పోలీసు భద్రత అవసరంలేదన్న ఏపీ హైకోర్టు... పిటిషన్ డిస్మిస్

- పొన్నవోలుకు ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ
- భద్రత కల్పించాలని కోరుతూ పొన్నవోలు పిటిషన్
- సుదీర్ఘ వాదనల తర్వాత తీర్పు రిజర్వ్... తాజాగా తీర్పు వెల్లడి



వివరాలు 2లో..

## కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు గట్టి షాక్!

- జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన రంగారెడ్డి కోర్టు
- అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల కేసులో అరెస్టైన జానీ మాస్టర్
- ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో జానీ మాస్టర్



పెన్ పవర్ డెస్క్:ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌ను రంగారెడ్డి జిల్లా కోర్టు కొట్టివేసింది. అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో జానీ మాస్టర్ అరెస్టయ్యాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైల్లో ఉన్నాడు. రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టులో ఇటీవల జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా...

వివరాలు 2లో..

## స్టార్టప్ ఆంధ్ర... ఇది నినాదం మాత్రమే కాదు... ఆయుధం కూడా

- ఢిల్లీలో లీడర్ షిప్ సదస్సులో పాల్గొన్న నారా లోకేశ్
- వరదల్లో డ్రోన్లు ఉపయోగించామని వెల్లడి
- ముంపు ప్రాంతాల్లో ఎంతో ఉపయోగపడ్డాయని వివరణ

పెన్ పవర్ డెస్క్:పరిశ్రమల స్థాపనకు భారత్ లో మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో అనువైన వాతావరణాన్ని కల్పించి, ప్రోత్సహకాలు అందజేస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని తాజ్ మహల్ హోటల్ లో జరిగిన యుఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం లీడర్ షిప్ సమ్మిట్ లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు.

వివరాలు 2లో..




## అప్పుడేమో చేగువేరా అన్నారు... ఇప్పుడేమో చంద్రబాబు అంటున్నారు

- చంద్రబాబు తనకు స్ఫూర్తి అన్న పవన్ కల్యాణ్
- పవన్ కు ఎంతమంది స్ఫూర్తి అంటూ చెల్లుబోయిన ప్రశ్న
- సనాతనధర్మం పేరుతో డ్రామాలాడారని విమర్శ

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈరోజు ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. పరిపాలనలో చంద్రబాబు తనకు స్ఫూర్తి అని ఆయన చెప్పారు. ఈ వ్యాఖ్యలపై వైసీపీ నేత, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సెటైర్లు వేశారు.పవన్ కు ఎంత మంది స్ఫూర్తి? అని ఆయన ప్రశ్నించారు. చేగువేరా తనకు స్ఫూర్తి అని గతంలో పవన్ చెప్పారని...

వివరాలు 2లో..



## మీ బెంగళూరులో ఏమో కానీ... ఇక్కడ మాత్రం..!

### జగన్ కు టీడీపీ కౌంటర్



- ఉచిత ఇసుక ఎక్కడ దొరుకుతోందని జగన్ ప్రశ్న
- మీ ఇసుక దోపిడీపై ఎఫ్ఐఆర్ నమోదయిందన్న టీడీపీ
- మద్యం అమ్మకాలపై కూడా విచారణ ప్రారంభమవుతుందని వెల్లడి

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:ఏపీలో ఉచిత ఇసుక ఎక్కడ దొరుకుతోందంటూ వైసీపీ అధినేత జగన్ ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై టీడీపీ మండిపడింది. నువ్వు ఉండే బెంగళూరులో ఏమో కానీ... ఏపీలో మాత్రం

## టీడీపీ కార్యాలయంపై దాడి కేసు ప్రధాన నిందితుడు చైతన్యకు 14 రోజుల రిమాండ్

- గతంలో టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి
- ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్న పలువురు వైసీపీ నేతలు
- కోర్టులో లొంగిపోయిన వైసీపీ విద్యార్థి విభాగం నేత
- చైతన్యకు ఈ నెల 28 వరకు రిమాండ్ విధించిన మంగళగిరి కోర్టు

పెన్ పవర్ డెస్క్:మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం పై దాడి కేసులో ప్రధాన నిందితుడు పానుగంటి చైతన్య ఇవాళ కోర్టులో లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, కోర్టు చైతన్యకు 14 రోజుల రిమాండ్ విధించింది. మంగళగిరి కోర్టు ఈ నెల 28 వరకు రిమాండ్ విధించింది.చైతన్య లొంగిపోయిన నేపథ్యంలో, టీడీపీ ఆఫీసుపై దాడి కేసు దర్యాప్తు వేగవంతం కానుంది. ఇప్పటికే ఈ కేసులో లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, దేవినేని అవినాశ్ వంటి వైసీపీ నేతలను పోలీసులు ప్రశ్నిస్తున్నప్పటికీ, వారి నుంచి సరైన సమాచారం రావడంలేదని తెలుస్తోంది. ఇప్పుడు చైతన్యను ప్రశ్నించనున్న పోలీసులు, అతడి నుంచి సేకరించే సమాచారం ఆధారంగా, మిగతా నిందితుల నుంచి కీలక సమాచారం రాబట్టేందుకు అవకాశం ఏర్పడింది.



## తిరుమల కొండపై ఎడతెరిపి లేకుండా వాన



పెన్ పవర్ డెస్క్:దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఈ వేకువజాము నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలలోనూ తెల్లవారుజాము 4 గంట నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. తిరుమాడ వీధుల్లో నీళ్లు ప్రవహిస్తున్నాయి.తిరుమలలో భారీ వర్షం కారణంగా భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్పందించారు. భక్తులు వర్షంలో ఉండొద్దని, షెడ్లు ఖాళీ అయిన వెంటనే లోపలికి పంపిస్తామని చెప్పారు.

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- ఏపీ దక్షిణ కోస్తాలో జోరుగా వానలు
- వేకువజామున 4 గంటల నుంచి తిరుమలలో భారీ వర్షం

## మెసేజ్ ల ద్వారా ప్రజలను అలర్ట్ చేయండి

- ఏపీలో పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలు
- మంత్రులు, జిల్లా కలెక్టర్లతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- కాలువలు, చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచన



పెన్ పవర్ డెస్క్:ఏపీలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో వర్షాలపై మంత్రులు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కాలువలు,

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కర్ణాటక సీఎం మార్పు తప్పదా...

కర్ణాటక రాజకీయాలు కూడా నాటకాలను మరిపిస్తుంటాయి. పార్టీలు ఏవైనా ముఖ్యమంత్రి పాత్రలు మారుతుంటాయి. గత రాజకీయ చరిత్ర పరిశీలిస్తే గత నాలుగు దశాబ్దాల్లో రెండేళ్ల తక్కువగా ప్రతి కొత్త ప్రభుత్వం అలజడులతోనే బాధ్యతలు స్వీకరించడం పరిపాటి. అవినీతి ఆరోపణలు, రాజకీయ అస్థిరత, నాయకత్వానికి సవాళ్లు, తదితర అంశాలు అస్తవ్యస్థ పాలనకు దారి తీస్తున్నాయి. ఓటర్ల నుంచి స్పష్టమైన తీర్పును సాధించినప్పటికీ సిద్ధరామయ్య 16 నెలల ప్రభుత్వం అనేక విధాలైన సవాళ్లు, ఒడిదుడుకులకు గురవుతోంది. 1980 అప్పటి రామకృష్ణ హెగ్డే ప్రభుత్వానికీ ఇదే గడ్డు పరిస్థితి ఎదురైంది. ఆ తరువాత 1989 94 మధ్య ఐదేళ్లలో ముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రులు మారారు. ఇది జనతాదళ్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి దారి చూపించింది. మళ్లీ 199499 మధ్యకాలంలో చీలికలు తలెత్తాయి. తరువాత ఎస్ఎం క్రిష్ణ సారథ్యంలో 1999 నుంచి 2004 వరకు కాంగ్రెస్ పాలనా కాలంలో కన్నడ కంఠీరవగా పేరొందిన నటుడు రాజ్‌కుమార్‌ను గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కిడ్నాప్ చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ట తెచ్చిపెట్టింది. ఆ తరువాత బిజెపి సంకీర్ణ ప్రభుత్వం 2004 నుంచి 2008 వరకు పగ్గాలు చేపట్టినా అస్థిరతకు గురై ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. 2008 నుంచి 2013 వరకు ఇండిపెండెంట్ల మద్దతుతో మనుగడ సాగించింది. 2013 నుంచి 2018 వరకు సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మరో ఐదేళ్లు సంకీర్ణ ప్రభుత్వంతో ముగ్గురు ముఖ్యమంత్రులు పీఠమెక్కవలసి వచ్చింది. 2018 నుంచి 2023 వరకు మార్పులు కొనసాగాయి. ఇప్పుడు అదే చరిత్ర మళ్లీ తిరిగి రాయవలసిన సంకేతాలు కనిపిస్తున్నాయి. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూమి కేటాయింపు కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్ద రామయ్య కూరుకుపోవడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కష్టాలు ఎదురవుతున్నాయి. ముద్దాయిగా ప్రభుత్వం ప్రజల ముందు తలవంచాల్సి వస్తోంది. రాష్ట్ర నాయకత్వ మార్పు విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకోడానికి కొంత సమయం పడుతుందని పార్టీలోని కొందరు చెబుతున్నారు. ఈలోగా అనేక ఊహాగానాలు పుట్టుకొస్తున్నాయి. ఈ సమయంలో ప్రతిపక్షాల ఒత్తిడికి తలొగ్గిందన్న అభిప్రాయం రాకూడదని కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టమైన విధానంతో ఉంటోంది. సుస్థిర ప్రభుత్వం అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ప్రయత్నిస్తోంది. అయినా ప్రభుత్వాన్ని కలవరపెడుతున్న అంతర్గత సవాళ్లను ముందు పరిష్కరించడం తక్షణ కర్తవ్యం. ప్రస్తుత ముఖ్యమంత్రి గౌరవప్రదంగా తప్పుకోవడం మొదట జరగాలి. రెండవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సిద్దరామయ్య ఇదివరకటి నాయకుల కన్నా కాంగ్రెస్ రాజకీయాల్లో తన ప్రత్యేక శైలిని కనబరిచారు. ఆయన వెనుకబడిన వర్గాల్లో అహింద (కన్నడ మైనార్టీ వర్గాలకు, వెనుకబడిన తరగతులకు, దళితులకు సంకేతం) నాయకుడు. రాజకీయంగా బడుగు వర్గాలనన్నిటినీ ఒకే తాటిపైకి తీసుకురాగల సమర్థుడు. అందుకనే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఆయనపై కచ్చితమైన అంచనా వేసింది. ఇవే అంశాలు మళ్లీ ఆయన 2023లో ముఖ్యమంత్రిగా రావడానికి దోహదం చేశాయి. అయితే గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న రాజకీయ పరిణామాలు సిద్దరామయ్య ఉనికికి దెబ్బతీశాయి. కాంగ్రెస్ అధిష్ఠానం ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు అత్యంత జాగ్రత్తగా వ్యూహాన్ని అమలు చేయడం అవసరం. డిప్యూటీ సిఎం డికె శివకుమార్ రేసులో లేకుండా అసలైన వారసుడుగా తనకు తాను భావించుకుంటున్నారు. పార్టీ అధిష్టానం తననే ఎంపిక చేస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. రాష్ట్రంలో మరికొందరు కాంగ్రెస్ నాయకులు కూడా తాము ముఖ్యమంత్రి పదవికి అర్హత కలిగిన గట్టి అభ్యర్థులమన్న ఆశల పల్లకీలో ఊరేగుతున్నారు. ఈ విషయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఖరి కీలకమవుతుంది. అధికార కాంగ్రెస్ తనకు తానే ఏమీ చేయలేని సందిగ్ధంలో పడితే, దీన్ని అవకాశంగా తీసుకుని ప్రధాన విపక్షం బిజెపి, అసెంబ్లీలో బలబలాల్లో చీలిక తీసుకురాడానికి ఎత్తుగడలు వేయవచ్చు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సంభవించిన ఓటమి నుంచి బిజెపి ఇంకా కోలుకోలేదు. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను బిజెపి సాధించగలిగినా 2019 నాటి ఫలితాలతో పోలిస్తే ఆమేరకు అంతగా రాలేనట్టే. రాష్ట్ర బిజెపిలో వర్గరాజకీయాలు బాహాటంగానే బయటపడుతున్నాయి. బిజెపి కేంద్ర నాయకత్వం ఇందులో జోక్యం చేసుకుని మధ్యవర్తిత్వం వహించడానికి ఇష్టపడటం లేదు. మరో ముఖ్య విషయం జెడిఎస్‌తో పొత్తు రాష్ట్ర బిజెపికి సంకటంగానే తయారైంది.

# పొన్నవోలుకు పోలీసు భద్రత అవసరంలేదన్న ఏపీ హైకోర్టు... పిటిషన్ డిస్మిస్

**పెన్ పవర్ డెస్క్:** గత ప్రభుత్వ హయాంలో అదనపు అడ్వొకేట్ జనరల్ గా వ్యవహరించిన పొన్నవోలు సుధాకర్ రెడ్డికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. భద్రత కల్పించాలంటూ పొన్నవోలు దాఖలు చేసిన పిటిషన్ పై న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. పొన్నవోలుకు పోలీసు భద్రత అవసరం లేదని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు పొన్నవోలు పిటిషన్ ను కొట్టివేసింది. పొన్నవోలు పిటిషన్ పై హైకోర్టులో సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం... ఇవాళ తీర్పును వెలువరించింది. పొన్నవోలుకు ఏపీ న్యాయవర్గాల్లో సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు ఉంది. ఇవాళ ఆయన సొంత కేసులోనే ఓడిపోయారు. పొన్నవోలుకు పోలీసు భద్రత అవసరంలేదని హైకోర్టు గతంలో విచారణ సందర్భంగా స్పష్టం చేసింది. పొన్నవోలు ప్రాణాలకు వచ్చిన ముప్పేమీ లేదని భద్రతా సమీక్ష కమిటీ నిర్ధారించిన విషయాన్ని కూడా హైకోర్టు అప్పట్లో ప్రస్తావించింది. రివ్యూ కమిటీ నివేదికపై అభ్యంతరాలు ఉంటే సవాల్ చేసుకోవచ్చని పొన్నవోలుకు సూచించింది. తాజాగా హైకోర్టు ఏకంగా పిటిషన్ నే కొట్టివేయడంతో పొన్నవోలుకు తీవ్ర నిరాశ తప్పలేదు.

# స్టార్టప్ ఆంధ్ర... ఇది నినాదం మాత్రమే కాదు... ఆయుధం కూడా

- మొదటి పేజీ తరువాయి

ఈ సదస్సుకు ఫోరమ్ చైర్మన్, జేసీ2 వెంచర్స్ వ్యవస్థాపకుడు జాన్ ఛాంబర్స్ అధ్యక్షత వహించారు. ఫైర్ సైడ్ సంభాషణలో ఆపిల్ ఇండియా మేనేజింగ్ డైరక్టర్ విరాట్ భాటియా అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సూటిగా సమాధానాలిచ్చారు.

నేడు వేగంగా మారుతున్న అధునాతన సాంకేతిక ప్రక్రియలో స్టార్టప్ అంధ్ర అనేది కేవలం నినాదం మాత్రమే కాదని, పరిపాలన విధానాన్ని సమూలంగా మార్చే ఓ అద్భుతమైన ఆయుధంగా ఉపయోగపడుతోందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అంకురాల ద్వారా సాంకేతికతను ఏకీకృతం చేసి వినూత్న మార్గాలు అన్వేషిస్తున్నట్లు చెప్పారు. గత నెలలో ఏపీలో సంభవించిన వరద విపత్తును సమర్థంగా ఎదుర్కోవడంలో అంకుర సంస్థల వినియోగం ఓ నూతన అధ్యాయంగా అభివర్ణించారు. సెప్టెంబర్ మొదటి వారంలో వరద ముంచెత్తినప్పుడు

శాఖల మధ్య సమన్వయం, సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొనేందుకే అనుసంధాన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. సహాయక చర్యల కోసం తొలిసారిగా తమ ప్రభుత్వం డ్రోన్‌ల వినియోగాన్ని ప్రారంభించిందని లోకేశ్ వివరించారు. విజయవాడలో 40 కిలోల వరకు మోసుకెళ్లగల డ్రోన్‌లను వినియోగించామని, ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలకు ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయని అన్నారు

# మీ బెంగళూరులో ఏమో కానీ... ఇక్కడ మాత్రం..!

- మొదటి పేజీ తరువాయి

దొరుకుతోందని తెలిపింది. ఇసుక, మద్యం గురించి నీవు ఎంత తక్కువ మాట్లాడితే నీకు అంత మంచిదని హితవు పలికింది. 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్ట కొట్టి... వందల మంది ఆత్మహత్యకు కారణమయ్యావని విమర్శించింది.

నీ ఇసుక దోపిడీకి సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదయిందని, విచారణ కూడా జరుగుతుందని టీడీపీ తెలిపింది. ఏ నిమిషమైనా తాడేపల్లి

కొంప వరకు వస్తుందని చెప్పింది. పాలన, పాలసీల గురించి మాట్లాడే హక్కు నీకు లేదని వ్యాఖ్యానించింది. వైసీపీ హయాంలో మద్యం అమ్మకాలపై కూడా త్వరలోనే విచారణ ప్రారంభమవుతుందని తెలిపింది.

# ఈ నెల 22, 23 తేదీల్లో అమరావతి డ్రోన్ సమ్మిట్

### మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్లో రెండ్రోజుల పాటు డ్రోన్ సమ్మిట్

### ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

### ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి సదస్సు

### భాగస్వామిగా డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా




ఈ నెల 22, 23 తేదీల్లో అమరావతి డ్రోన్ సమ్మిట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్ లో ఈ జాతీయ స్థాయి సదస్సును రెండ్రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ దిశగా ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ జాతీయ సెమినార్ నిర్వహణను ఏపీ డ్రోన్ కార్పొరేషన్ నిర్వహిస్తుండగా.... భాగస్వామిగా డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వ్యవహరించనుంది. వ్యవసాయం, వైద్య, ఆరోగ్య, పట్టణ ప్రణాళిక, శాంతిభద్రతలు, వస్తు ఉత్పత్తి అంశాల్లో డ్రోన్ల వినియోగం, అందుకు తగిన విధాన రూపకల్పనపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించనున్నారు. వాణిజ్యపరంగానూ డ్రోన్ల వినియోగాన్ని పెంచడం, డ్రోన్ సిటీ ఏర్పాటుకు సంబంధించిన రోడ్ మ్యాప్ రూపకల్పనపై ఈ సదస్సులో దృష్టి సారించనున్నారు.

# కెనడా నుంచి భారత్ దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించిన కేంద్రం

### కెనడాలోని దౌత్యవేత్తలకు రక్షణ లేదన్న భారత ప్రభుత్వం

### భద్రత కల్పించే విషయంలో ట్రూడో ప్రభుత్వంపై నమ్మకం లేదన్న భారత్

### హైకమిషనర్, ఇతర దౌత్యవేత్తలు, అధికారులను వెనక్కి పిలిపించిన కేంద్రం



కెనడాలోని భారత హైకమిషనర్, ఇతర దౌత్యవేత్తలను, అధికారులను వెనక్కి పిలిపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రకటించింది. కెనడాలోని తమ దౌత్యవేత్తలకు రక్షణ లేదని, అందుకే వెనక్కి పిలిపించాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. కెనడాలో తమ దౌత్యవేత్తలకు భద్రత కల్పించే విషయంలో ప్రస్తుత ట్రూడో సర్కార్‌పై తమకు నమ్మకం లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో హైకమిషనర్ సహా దౌత్యవేత్తలు వెనక్కి వస్తున్నారు.

ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో ఇటీవల భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ సహా పలువురు దౌత్యవేత్తలను అనుమానితులుగా కెనడా పేర్కొంది. దీనిని భారత్ తీవ్రంగా ఖండించింది. భారత హైకమిషనర్‌ను అనుమానితుడిగా పేర్కొనడంతో భారత్ కూడా తీవ్రంగా స్పందించింది. భారత్‌లోని కెనడా దౌత్యవేత్తకు విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా భారత హైకమిషనర్, ఇతర దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదని కెనడా దౌత్యాధికారికి భారత్ తేల్చి చెప్పింది. భారత వ్యతిరేక కార్యకలాపాలకు ట్రూడో ప్రభుత్వం ఇస్తున్న మద్దతుకు ప్రతిస్పందనగా తగిన చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని తెలిపింది.

# అమరావతిలో రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్

- మొదటి పేజీ తరువాయి

ఇన్నొవేషన్, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఎకోసిస్టమ్, మెంటార్ స్టార్టప్స్ గురించి ఈ హబ్ ను ఏర్పాటు చేస్తున్నట్టు చంద్రబాబు తెలిపారు. ప్రతిదాన్ని ప్రముఖ బిజినెస్ గ్రూప్స్ మెంటార్ చేస్తాయని... డెవలప్ అవుతున్న సెక్టార్లలో టెక్నాలజీ, స్కిల్ డెవలప్ మెంట్ కు కృషి చేస్తాయని చెప్పారు. రాష్ట్రంలోని ఐదు జోనల్ సెంటర్లతో ఈ హబ్ అనుసంధానమై ఉంటుందని తెలిపారు.

# అప్పుడేమో చేగువేరా అన్నారు... ఇప్పుడేమో చంద్రబాబు అంటున్నారు

- మొదటి పేజీ తరువాయి

ఇప్పుడేమో చంద్రబాబు తనకు స్ఫూర్తి అంటున్నారని ఎద్దేవా చేశారు. నిన్నటి వరకు సనాతనధర్మం పేరుతో డ్రామాలాడారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఎక్సైజ్ పాలసీపై కూడా చెల్లుబోయిన విమర్శలు గుప్పించారు. సొంతవారికి సంపద సృష్టించేందుకే కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చారని మండిపడ్డారు. మద్యం టెండర్లకు దరఖాస్తు ప్రక్రియను రెండు రోజులు పొడిగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రజలను తాగుబోతులు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి

- మొదటి పేజీ తరువాయి

నోబెల్ దక్కింది. ఈ నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. ఈ అవార్డును ఆల్ఫ్రెడ్ నోబెల్ జ్ఞాపకార్థం అందజేస్తున్నారు.

# కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు గట్టి షాక్!

- మొదటి పేజీ తరువాయి

విచారణ అనంతరం ఈ రోజు కొట్టివేసింది. జానీ మాస్టర్ అరెస్టయ్యాక నార్సింగి పోలీసులు కోర్టు అనుమతితో అతనిని నాలుగు రోజుల పాటు కస్టడీకి తీసుకొని విచారించారు.

# మెసేజ్ ల ద్వారా ప్రజలను అలర్ట్ చేయండి

- మొదటి పేజీ తరువాయి

చెరువులు, నీటి వనరుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువు కట్టలు, కాలువల కట్టలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. కాలువలు, వాగుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. వర్షాలపై ప్రజల మొబైల్ ఫోన్లకు మెసేజ్ లు పంపుతూ అలర్ట్ చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని... ప్రజల నుంచి వచ్చే వినతులపై వేగంగా స్పందించాలని అన్నారు. మరోవైపు... ఉమ్మడి అనంతపురం, కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. ఆ జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని చెప్పారు.

# ముత్యాలమ్మ ఆలయం ఘటన... తీవ్రంగా స్పందించిన కేటీఆర్

సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్ సమీపంలోని కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం పట్ల దారుణంగా ప్రవర్తించిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ అంశంపై ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఈ ఘటనను ఆయన ఖండించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడి తీవ్రకలకలం రేపుతోందని పేర్కొన్నారు. ఇలాంటి తెలివితక్కువ చర్యలు మన హైదరాబాద్ నగరం సహనశీలతకు మచ్చను తీసుకు వస్తాయన్నారు. ఇలాంటి దుర్మార్గానికి పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా శాంతిభద్రతలు దిగజారుతున్నాయని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

### ఏం జరిగింది?

సికింద్రాబాద్ కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంలో ఓ దుండగుడు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. ఈ విషయం తెలియడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకున్నారు. స్థానికులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసేముందు నిందితుడు ఆలయం గేట్‌ను కాలితో తన్ని లోపలకు వెళ్లాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి.

# పీపీపీలో రోడ్ల నిర్మాణం...



**విజయవాడ, అక్టోబరు 14, పెన్ పవర్:** ఏపీలో రోడ్లను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పీపీపీ మోడల్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ మేరకు 100 రోజుల ఖరారు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రణాళికను ఖరారు చేసి రెండు నెలల్లో ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించాల్సి ఉంటుందిరాష్ట్రంలోని రోడ్ల నిర్మాణం ఇకపై ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్‌లో జరగనున్నాయి. దీని కార్యాచరణ ఖరారు చేయడానికి ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో కమిటీ నియమించింది. ఈ కమిటీ కార్యాచరణను ఖరారు చేసి రెండు నెలల్లో ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు రవాణా, రోడ్లు, భవనాల డిపార్టమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు.రోడ్లు, భవనాలు (ఆర్‌అండ్‌బీ) డిపార్ట్‌మెంట్, ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) పీపీపీ పద్ధతిలో రోడ్ల నిర్మాణం కోసం వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. 2024 సెప్టెంబర్ 13న ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్, రోడ్లు, భవనాలు (ఆర్‌అండ్‌బీ) చీఫ్ ఇంజినీర్ పంపిన లేఖలో ప్రభుత్వం శాఖల వారీగా వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రారంభించిందని తెలిపినట్లు ఉత్తర్వుల్లో సెక్రటరీ కాంతిలాల్ దండే తెలిపారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రోడ్లు, భవనాల డిపార్ట్‌మెంట్‌కు కేటాయించిన అంశాలలో "రోడ్ల నిర్మాణంలో పీపీపీ విధానం ఆమోదం" ఒకటని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.దీని ప్రకారం రోడ్ల నిర్మాణం కోసం విధానాన్ని 100 రోజుల్లో ఆమోదించాలి. రాష్ట్రంలో ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్‌లో రోడ్ల నిర్మాణం కోసం పీపీపీ పాలసీని సిద్ధం చేయడానికి, ఖరారు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం నిశితంగా పరిశీలించిన తరువాత రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ డిపార్ట్‌మెంట్‌లో రోడ్ల నిర్మాణం కోసం పీపీపీ పాలసీని సిద్ధం చేయడానికి, ప్రణాళికను ఖరారు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది.రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణం కోసం పీపీపీ పాలసీని సిద్ధం చేయడానికి, ప్రణాళికను ఖరారు చేయడానికి ఐదుగురు సభ్యులతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో కన్వీనర్‌గా చీఫ్ ఇంజినీర్ (ఆర్‌అండ్‌బీ) ఎస్‌హెచ్, ఎండీ, ఏపీఆర్‌డీసీ, సభ్యులుగా ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఆర్‌అండ్‌బీ) ఎండీఆర్ఎస్, అడ్మినిస్ట్రేషన్, చీఫ్ ఇంజినీర్ (ఆర్‌అండ్‌బీ) ఎన్‌హెచ్ ఊ సీఆర్ఎఫ్, డిప్యూటీ ఆర్థిక సలహాదారు సురేంద్ర దత్తి, పీపీపీ నిపుణుడు షాలెం రాజు ఉన్నారు. అయితే పాలసీ ఖరారు చేసి కమిటీ నివేదికను రెండు నెలల్లో ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా చీఫ్ ఇంజినీర్ (ఆర్‌అండ్‌బీ) ఎస్‌హెచ్ ఊ ఎండీ, ఏపీఆర్‌డీసీ, అండ్ కమిటీ కన్వీనర్‌కు నిర్దేంచారు.సీఎం చంద్రబాబు పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర రహదారులను కూడా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్‌లో చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు రోడ్లు, భవనాల మంత్రిత్వ శాఖను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటి వరకు జాతీయ రహదారులకే పరిమితం అయిన టోల్ టాక్స్, ఇప్పుడు రాష్ట్ర రహదారులకు కూడా వర్తిస్తుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే రోడ్డు ట్యాక్స్ పెరిగి, భరించలేని విధంగా ఉన్న నేపథ్యంలో ఇప్పుడు రాష్ట్ర రాహదారులపై టోల్‌గేట్లు పెట్టి టోల్ ట్యాక్స్ వసూలు చేస్తే అదనపు భారమే అవుతుందని వాహనదారులు అంటున్నారు. దీనివల్ల ప్రజలపై భారాలు పడతాయని ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి.రాష్ట్రంలో 8,500 కిలో మీటర్ల మేర జాతీయ రహదారులు, 12,653 కిలో మీటర్ల మేర రాష్ట్ర రహదారులు, 32,725 కిలో మీటర్ల మేర జిల్లా రహదారులు ఉన్నాయి. జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రయాణికులకు, వాహన యజమానులకు టోల్ ఛార్జీల భారం పడుతోంది. ఇప్పుడు 12,653 కిలో మీటర్ల మేర ఉన్న రాష్ట్ర రహదారులను పీపీపీ పద్దతిలో చేపట్టి టోల్ వసూలు చేస్తే ప్రజలపై భారం అధికమవుతుంది. 12,653 కిలో మీటర్ల రాష్ట్ర రహదారులు కూడా పీపీపీ పద్ధతిలో చేపట్టి టోల్ వసూలు చేసేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం 2016లోనే నిర్ణయం తీసుకున్నారు. అప్పుడు రాష్ట్రంలో 31 రోడ్లను పీపీపీ పద్దతిలో చేపట్టాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అప్పటికే కరెంటు ఛార్జీలు పెంపు, రాష్ట్రంలో ప్రత్యేక హోదా ఉద్యమంతో అది కాస్తా మధ్యలోనే ఆగిపోయింది.అయితే 2019 ఎన్నికల్లో చంద్రబాబు ఓటమి చెంది, వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అది ఆగిపోయింది. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు నాటి నిర్ణయాన్ని అమలు చేయాలని యోచిస్తున్నారని సమాచారం. గతంలో గుర్తించిన 31 రోడ్లలో 14 రోడ్లను 1,000 కిలో మీటర్ల పరిధిలో యుద్ధ ప్రాతిపదికన పీపీపీ మోడల్‌లో చేపట్టేందుకు కార్యచరణను రూపొందించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తాజాగా రోడ్ల నిర్మాణం కోసం పీపీపీ విధానాన్ని ఖరారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది

# జనసేన మీటింగ్ లో రాపాక...




**కాకినాడ, అక్టోబరు 14, పెన్ పవర్:** కోనసీమ రాజకీయాల్లో కొత్త సీన్ కనిపించింది. జనసేన మీటింగ్‌లో రాపాక వరప్రసాద్ ప్రత్యక్షమయ్యారు. దీంతో ఒక్కసారిగా అందరూ ఆశ్చర్యపోయారు. 2024లో వైసీపీ తరఫున అమలాపురం ఎంపీగా పోటీచేసిన నేత.. జనసేన మీటింగ్‌లో కనిపించడం హాట్ టాపిక్‌గా మారింది. మాజీ ఎమ్మెల్యే రాపాక ప్రత్యక్షం అయ్యారు. మలికిపురంలో జనసేన కార్యక్రమానికి హాజరైన రాపాక.. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను కలిశారు. 2019లో జనసేన తరఫున గెలిచి వైసీపీలోకి వెళ్లిన రాపాక.. 2024లో అమలాపురం వైసీపీ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇటీవల ఆయన కూటమి నేతలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.రాపాక వరప్రసాద్ త్వరలోనే టీడీపీలో చేరతారనే ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా ఓసారి రాపాక వరప్రసాద్.. దేవ వరప్రసాద్‌ను కలిశారు. దీంతో ఆయన కూటమిలో చేరడం ఖాయమనే చర్చ జరిగింది. తాజాగా.. మళ్లీ జనసేన మీటింగ్‌లోని కనిపించడం హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. ఆయన ఓ ఇష్యూపై తనను కలిశారని జనసేన ఎమ్మెల్యే స్పష్టం చేశారు.రాజోలు నియోజకవర్గంలో ఓ కాలేజీ అధ్యాపకులు ఆందోళన చేస్తున్నారని.. ఆ అంశంపైనే చర్చించేందుకు రాపాక వచ్చారని దేవ వరప్రసాద్ స్పష్టం చేశారు. రాపాక వరప్రసాద్ 2019లో జనసేన నుంచి రాజోలు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఆయన వైసీపీకి దగ్గరయ్యారు. అప్పుడు జనసేన క్యాడర్ ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.రాపాక మళ్లీ రాజోలు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించారు. కానీ.. అక్కడ ఓడిపోతారని.. అమలాపురం ఎంపీగా పోటీ చేయాలని జగన్ సూచించారు. ఈ నేపథ్యంలో.. 2024లో అమలాపురం ఎంపీగా పోటీ చేశారు. ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత వైసీపీ సమావేశాల్లో ఎక్కడా కనిపించడం లేదు. దీంతో ఆయన జనసేన లేదా టీడీపీలో చేరతారనే ప్రచారం జరిగింది.టీడీపీకి మంచి బలం ఉన్న నియోజకవర్గం అయిన రాజోలులో.. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పార్టీని చూసుకున్నారు. జనసేన 2019లో గెలిచిన స్థానం కావడంతో టీడీపీ ఆశలు వదులుకుంది. గొల్లపల్లి సూర్యారావు తన కుమార్తెను జనసేనలో చేర్చుకుని టిక్కెట్ ఇస్తే గెలుపు ఖాయమని కూటమి నేతలకు చెప్పారు.అమూల్య భర్త బిసి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో.. ఆ వర్గం నుండి మెజారిటీ ఓట్లు తెచ్చుకుంటుదన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. అయితే గొల్లపల్లి కుటుంబానికి టిక్కెట్ ఇస్తే.. నియోజకవర్గం టీడీపీకి ఇచ్చినట్లేనని జనసైనికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో దేవ వరప్రసాద్‌కు టికెట్ లభించింది. ఆయన విజయం సాధించారు.

**అవమానం జరిగింది...**

కోనసీమ జిల్లా రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వైసీపీని వీడుతున్నట్లు స్పష్టం చేశారు. ఆదివారం తన నివాసంలో మీడియాతో మాట్లాడిన ఆయన... వైసీపీ కోసం ఎంతో కష్టపడినా...రాజోలులో తనకు టికెట్ ఇవ్వలేదన్నారు. తనను వైసీపీ అవమానించిందని ఆవేదన చెందారు. తనపై నమ్మకం లేక గొల్లపల్లి సూర్యారావుకు రాజోలులో టికెట్ ఇచ్చారన్నారు. తనకు ఇష్టం లేకపోయినా వైసీపీ పెద్దల సలహాతో అమలాపురం నుంచి ఎంపీగా పోటీ చేశానన్నారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. త్వరలో మరో పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఐదేళ్లపాటు వైసీపీ పెద్దలు చెప్పినట్లు చేసినా 2024 ఎన్నికల్లో తనకు రాజోలు ఎమ్మెల్యే టికెట్ కేటాయించలేదని రాపాక ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇష్టలేకపోయినా ఎంపీగా నిలబెట్టారన్నారు. రాజోలు నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ఎంతో కష్టపడ్డానన్నారు. అయినా తనకు కాకుండా గొల్లపల్లి సూర్యారావుకి వైసీపీ తరఫున టికెట్ ఇచ్చారని రాపాక మండిపడ్డారు. ఈ విషయం తనను ఎంతో కలచివేసినట్లు... తన ప్రాధాన్యత లేని పార్టీలో ఉండదలచుకోలేదన్నారు. అందుకే వైసీపీని వీడుతున్నట్లు రాపాక ప్రకటించారు. అయితే ప్రస్తుతం తాను ఏ పార్టీలో చేరుతాననే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని రాపాక తెలిపారు. వైసీపీలో మాత్రం ఉండనని, వేరే పార్టీల నుంచి ఆహ్వానం వస్తే పరిశీలిస్తానన్నారు.2019 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన రాపాక వరప్రసాద్... ఆ ఎన్నికల్లో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో జనసేన గెలిచిన ఏకైక స్థానం రాజోలు. అయితే వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత ఆ పార్టీకి దగ్గరైన రాపాక...అనంతరం పార్టీలో చేరారు. జనసేనపై, ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పై రాపాక ఎన్నో సందర్భాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇక వైఎస్ జగన్ అండతో నియోజకవర్గంలో తనకు తిరుగులేదని భావించిన రాపాక... రాజోలు టికెట్ పై ఆశలు పెట్టుకున్నారు. తన కుమారుడి వివాహ కార్డుపై వైఎస్ జగన్, భారతి చిత్రాలు కూడా ముద్రించారు. అప్పట్లో ఇది వైరల్ అయ్యింది. జనసేన నుంచి గెలిచిన రాపాక... జగన్ కు జై కొట్టడంతో జనసైనికులు అప్పట్లో తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పుడు మళ్లీ రాపాక జనసేనకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఐదేళ్లు వైసీపీకి మద్దతు తెలిపిన రాపాకను గ్లాస్ పార్టీలోకి ఆహ్వానిస్తారో? వద్దంటారో? ఈ విషయంపై జనసైనికులు ఎలా స్పందిస్తారో తెలియాల్సి ఉంది. మరో వైపు రాపాక టీడీపీ లేదా బీజేపీలో చేరే అవకాశం ఉందన్న వార్తలు వస్తున్నాయి

# మార్చి నుంచి జనం బాటలోకి....

**గుంటూరు, అక్టోబరు 14, పెన్ పవర్:** జగన్ జనం బాట పట్టేందుకు సిద్ధపడుతున్నారా? కూటమి ప్రభుత్వం పై వ్యతిరేకత పెంచేలా ఆయన చర్యలు ఉండబోతున్నాయా? తొలి నాలుగు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం ఫెయిల్ అయిందని ఆయన భావిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయారు. వై నాట్ 175 అన్న నినాదంతో బరిలో దిగింది వైసిపి. కనీసం పోటీ ఇవ్వలేకపోయింది. 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం అయింది. కనివిని ఎరుగని పరా జయం ఎదురు కావడంతో వైసీపీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. ఇక పార్టీకి భవిష్యత్తు లేదని భావిస్తున్న వారు ఇతర పార్టీల్లో చేరుతున్నారు. సీనియర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. జూనియర్లు ఎవరూ మాట్లాడడం లేదు. పార్టీ శ్రేణులు సైతం సైలెంట్ అయిపోయాయి. మరోవైపు కూటమి పార్టీలు పట్టు పెంచుకుంటూ ముందుకు సాగుతున్నాయి. ఇటువంటి తరుణంలో పార్టీని కాపాడుకోవడం పై జగన్ దృష్టి పెట్టారు. లోకేష్ రెడ్ బుక్ మాదిరిగా.. తాను గుడ్ బుక్ రాసుకుంటున్నానని చెప్పుకొచ్చారు. అది ప్రత్యర్థుల కోసం కాదని.. తన వారి కోసమని.. పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించి..అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని విధాలా న్యాయం చేస్తానని జగన్ చెబుతున్నారు. అయితే ఈ ప్రకటనలు వైసీపీ శ్రేణులకు పెద్దగా స్వాంతన చేకూర్చడం లేదు. గత ఐదేళ్లుగా వారు చాలా రకాలుగా అనుభవాలు చవిచూశారు. అందుకే జగన్ ప్రకటనల విషయంలో నమ్మడం లేదు. అయితే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగితేనే వైసీపీ శ్రేణులు పార్టీలో కొనసాగుతాయి. లేకుంటే పునరాలోచనలో పడడం ఖాయం. సొంత పార్టీ శ్రేణులు వైసీపీలో కొనసాగాలంటే.. టిడిపి కూటమి ప్రభుత్వంపై కచ్చితంగా వ్యతిరేకత పెంచాలి. ఇప్పుడు అదే పనిలో ఉన్నారు జగన్.వైసిపి సోషల్ మీడియా విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని జగన్ భావిస్తున్నారు. ఇప్పటికే సజ్జల భార్గవ్ రెడ్డిని పక్కకు తప్పించారు. ఆయన స్థానంలో మరో నేతను తెచ్చారు. భారీగా రిక్రూట్మెంట్ చేయాలని భావిస్తున్నారు. ఇంకోవైపు తెలంగాణలో బీఆర్ఎస్ మాదిరిగా పెద్ద ఎత్తున డిజిటల్ మీడియా సహకారాన్ని తీసుకోవాలని చూస్తున్నారు. తెలంగాణలో దాదాపు 100 వెబ్సైట్లు, యూట్యూబ్ ఛానల్ లతో కేటీఆర్ ఒప్పందం చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు కూడా అదే ఫార్ములాను అనుసరించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల ప్రచారం కోసమే 87 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి ఫలితాలు వచ్చేవరకు ఈ మొత్తాన్ని ఖర్చు చేసినట్లు వైసిపి చెప్పిందని వార్తలు వచ్చాయి. ఆది నుంచి ప్రచారం విషయంలో జగన్ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చారు. ఇప్పుడు పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఈ విషయంలో దూకుడుగా ముందుకు సాగనున్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు అవుతోంది. వచ్చే ఏడాది మార్చినాటికి పరిస్థితి పతాక స్థాయికి చేరుతుందని.. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని జగన్ అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో ప్రజల్లోకి వస్తే భారీగా స్పందన వస్తుందని.. మునుపటిలా వివిధ అంశాల్లో బాధితులకు ఆర్థిక, హార్దిక సాయం అందించాలని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ వ్యతిరేకతకు తన వాయిస్ తోడైతే వైసీపీకి పూర్వ వైభవం ఖాయమని నమ్ముతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదంతా ఈజీ కాదు. 2019లో అంటే అప్పటి వరకు జగన్ అధికారం చేపట్టలేదు. ఇప్పుడు జగన్ జనాల్లోకి వెళితే గత ఐదేళ్ల పాలన వైఫల్యాలు సైతం బయటపడే అవకాశం ఉంది. వైసీపీ శ్రేణుల్లో అదే రకమైన ఆందోళన కనిపిస్తోంది. కానీ జగన్ మాత్రం ప్రభుత్వం పై వ్యతిరేకతను పెంచాలని చూస్తున్నారు. అందులో ఎంతవరకు సక్సెస్ అవుతారో చూడాలి.



# అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం లో మైనర్లు

**అనంతపురం, అక్టోబరు 14, పెన్ పవర్:** శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం ఘటనలో పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిని ఓ రహస్య ప్రదేశంలో ఉంచి విచారిస్తున్నారు.జిల్లా చిలమత్తూరు మండలంలో అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ కేసులో హిందూపురానికి చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని ఓ రహస్య ప్రదేశంలో ఉంచి విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరు చిల్లర దొంగతనాలు చేసే ముఠాగా పోలీసులు గుర్తించారు.మండలంలోని ఓ గ్రామంలో అత్తాకోడలిపై గుర్తుతెలియని దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితులకు హిందూపురం ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితులను మంత్రి సవిత పరామర్శించారు. ఈ దారుణంపై సీఎం చంద్రబాబు చాలా సీరియస్ అయ్యారని, సీఎం వారి ఆదేశాలతో 24 గంటల్లోనే నిందితులను పోలీసులు పట్టుకోగలిగారన్నారని మంత్రి సవిత తెలిపారు. నిందితుల కోసం పోలీసులు నాలుగు టీమ్ గాలించి అదుపులోకి తీసుకున్నాయన్నారు. మరికొన్ని గంటల్లో నిందితులను బయటపెడతామన్నారు. ఈ ఘటనలో ఆరుగురి ప్రమేయం ఉందని, వారిలో ముగ్గురు మైనర్లు కూడా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు.చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామంలో దసరా పండుగ పూట దారుణ జరిగింది. గుర్తుతెలియని దుండగులు అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నిర్మాణంలో ఉన్న ఓ పేపర్ మిల్లులో కర్ణాటకకు చెందిన ఓ కుటుంబం యజమాని వాచ్‌మన్ పనిచేస్తున్నారు. ఇతర కుటుంబ సభ్యులు ఇతర పనులు చేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున రెండు బైక్‌లపై వచ్చిన దుండగులు, కొడవలితో బెదిరించి అత్తాకోడలిపై ఘాతుకానికి పాల్పడ్డారు. తండ్రీకొడుకులను బెదించి ఇద్దరు మహిళలపై దారుణానికి పాల్పడ్డారు.కర్ణాటకలో బళ్లారికి చెందిన ఓ కుటుంబం చిలమత్తూరు పేపర్ మిల్లులో పనిచేసేందుకు ఐదు నెలల క్రితం ఇక్కడికి వచ్చింది. నిర్మాణంలో ఉన్న పేపర్ మిల్లు వద్దే ఉంటూ పనులు చేసుకుంటున్నారు. అయితే శనివారం తెల్లవారుజామున... కొందరు దుండగులు బైక్ లపై వచ్చి తండ్రీకొడుకులను కొడవలితో బెదిరించి, అత్తాకోడలిపై అత్యాచారం చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయ్యింది. నిందితులను త్వరగా పట్టుకోవాలని సీఎం చంద్రబాబు పోలీసులను ఆదేశించారు. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

# బీజేపీకి దూరంగా జగన్



**విజయవాడ, అక్టోబరు 14, పెన్ పవర్:** వైఎస్ జగన్ ఆలోచనల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. బీజేపీ వాడుకుని వదిలేసే రకం అన్న నిర్ణయానికి వచ్చారు. నాడు చంద్రబాబు, నేడు తాను బీజేపీ దెబ్బకు బలయిపోయానని వైఎస్ జగన్ గట్టిగా విశ్వసిస్తున్నారు. అందుకే ఆయన స్వరం ఇటీవల కాలంలో మారుతుంది. ఆయనతో పాటు వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి లాంటి వాళ్లు కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ?కి వ్యతిరేకంగా కామెంట్స్ చేస్తున్నారు. దీన్ని బట్టి బీజేపికి దూరమవ్వాలన్న ఆలోచనలో ఉన్నట్లే కనపడుతుంది. జగన్ మాటలను బట్టి అది సులువుగా అర్థమవుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తనకు అన్యాయం చేసిందన్న ధోరణిలో జగన్ ఉన్నారు.నిజానికి జగన్ ఎప్పుడూ బీజేపీతో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకోలేదు. అలాగని వ్యతిరేకించలేదు. 2014లో జగన్ ను తమ పార్టీతో పొత్తు పెట్టుకోవాలని జగన్ ను ఆ పార్టీ నేతలు కోరారని అప్పట్లో అనేక కథనాలు కూడా వచ్చాయి. కానీ మాత్రం 2014, 2019, 2024 ఎన్నికల్లో బీజేపీతో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకోలేదు. కాకుంటే 2019 ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయిన తర్వాత తన పార్టీ బీజేపీ కేంద్రంలో ప్రవేశ పెట్టిన ప్రతి బిల్లుకు మద్దతు తెలిపింది. ఇండియా కూటమికి దూరంగానే జగన్ నాటి నుంచి నిలిచారు. కాంగ్రెస్ తనను అక్రమ కేసులు పెట్టి జైలులో వేశారన్న ఏకైక కారణంతో ఆ పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. పైగా రాష్ట్ర విభజనకు కాంగ్రెస్ కావడం, వ్యతిరేకత ప్రజల్లో ఉండటంతో దాని దరి చేరలేదు.2024 ఎన్నికలలో జగన్ చాలా హోప్స్ పెట్టుకున్నారు. తాను అమలు చేసిన సంక్షేమ పథకాలు తనను గట్టెక్కిస్తాయని గట్టిగా విశ్వసించారు. అస్సలు టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకోదని కూడా నమ్మారు. కానీ బీజేపీ, జనసేన, టీడీపీ పొత్తు కుదిరింది. అయినా జగన్ ఒంటరిగానే పోటీ చేశారు దారుణంగా ఓటమి పాలయ్యారు. ఎంత కాన్ఫిడెంట్ గా ఉన్నారంటే జగన్ ఎన్నికల కౌంటింగ్ కు ముందు దేశంలోనే వైసీపీ రికార్డు స్థాయిలో విజయం సాధిస్తుందని చెప్పారు. అంత కాన్ఫిడెంట్ గా ఉన్న జగన్ కు ఫలితాల తర్వాత దిమ్మతిరిగిపోయింది. తన ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఎందుకు వచ్చిందో ఆయనకు అర్థం కాలేదు. అందుకు ఈవీఎంలు కారణమని, పరోక్షంగా బీజేపీ కూడా కొంత తోడ్పడిందని జగన్ నమ్ముతున్నారు.ఈ నేపథ్యంలోనే హస్తిన స్థాయిలో తనకు ఏదో ఒక ఆసరా అవసరమని జగన్ భావిస్తున్నట్లుంది. అందుకే ఇండియా కూటమితో చెలిమికి సిద్ధమయినట్లే కనపడుతుంది. అయితే నేరుగా పొత్తు పెట్టుకునే అవకాశం లేకపోయినా మద్దతును పరోక్షంగా ఇవ్వాలని భావిస్తున్నట్లుంది. అందుకే హర్యానా ఎన్నికల ఫలితాలపై ఈవీఎంల తీరు వల్లనే అంటూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు జగన్ కూడా మద్దతు తెలిపారంటున్నారు. దేశంలో మోదీ ప్రభ తగ్గి, ఇండియా కూటమి బలం పెరుగుతుండటం కూడా టోన్ ఛేంజ్ కావడానికి ఒక కారణమని వైసీపీ నేతలు చెబుతున్నారు. అయితే కాంగ్రెస్ తో నేరుగా పొత్తుకు దిగకపోయినా హస్తం పార్టీకి స్నేహ హస్తం అందించే అవకాశాలున్నాయన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# బందరులో రాళ్ళ దాడి

**రాష్ట్రమంతటా మారుమ్రోగుతున్న బందరు అల్లర్లు**

**మచిలీపట్నం పెన్ పవర్:** దసరా పండుగ వచ్చింది అంటే రెండు తెలుగు రాష్ట్రాలలో అందరి దృష్టి కర్నూలు జిల్లా దేవరగట్టు పైనే ఉంటుంది. కానీ ఇప్పుడు ఆ జాబితాలో బందరు కూడా చేరింది. కాకపోతే దేవరగట్టు గ్రామంలో కర్రలతో మాత్రమె కొట్టుకుని తలలు పగిలినా లెక్కచేయకుండా దేవతా మూర్తులను దక్కించుకునే ప్రయత్నం చేస్తారు. బందరులో అయితే ఏకంగా రాళ్ళు విసురుకుని బీబత్సం సృష్టించారు. ఈరోజు మచిలీపట్నం శక్తీ పటాల ఊరేగింపు లో జరిగిన రాళ్ళ దాడిని పరిశీలిస్తే లా అండ్ ఆర్డర్ విఫలం అయ్యిందేమో అన్నట్లుగా ఉంది. పోలీసులు చూస్తుండగా చిన్నపిల్లలు కూడా దాడిలో పాల్గొనడం ఆచ్చర్యానికి గురిచేసింది. రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం రాళ్ళ దాడికి దారితీసింది. ఒకేమార్గంలో రెండు శక్తీ పటాల ఊరేగింపులు వెళుతున్నప్పుడు పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోలేదా? ఎందుకు ఈ పరిస్థితి ఏర్పడింది అర్ధం కావడం లేదు. అయినా వివాదం జరిగిన ప్రాంతంలో అన్ని రాళ్ళు ఎక్కడినుండి వచ్చాయి?

# బాబర్ అజామ్ స్థానంలో కమ్రాన్ గులామ్.. ఎవరితను..? అంత పోటుగాడా..?






**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరగబోయే రెండో టెస్ట్ కు పాకిస్థాన్ సోమవారం (అక్టోబర్ 14) తమ ప్లేయింగ్ 11 ను ప్రకటించింది. రెండేళ్లుగా ఘోరంగా విఫలమవుతున్న బాబర్ అజామ్ ను చివరి రెండు టెస్టుల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. స్టార్ ప్లేయర్ ను బాబర్ ను తప్పించడంతో అతని స్థానంలో కమ్రాన్ గులామ్ ప్లేయింగ్ లో చోటు దక్కించుకున్నాడు. మంగళవారం (అక్టోబర్ 15) జరగనున్న రెండో టెస్టులో ఈ 29 ఏళ్ళ బ్యాటర్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. దీంతో ఈ ఆటగాడు ఎవరని నెటిజన్స్ వెతికే పనిలో ఉన్నారు.

**ఎవరీ కమ్రాన్ గులామ్..?**

కమ్రాన్ గులామ్ కు పాకిస్థాన్ దేశవాళీ క్రికెట్ లో అపారమైన అనుభవం ఉంది. రెండేళ్లుగా అత్యంత నిలకడగా రాణిస్తున్నాడు. దశాబ్దం పాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడుతూ అద్భుతమైన గణాంకాలను నమోదు చేశాడు. 49.72 యావరేజ్ తో 4,525 ఫస్ట్-క్లాస్ పరుగులు.. 42.32 యావరేజ్ తో 3,344 లిస్ట్ ఏ క్రికెట్ లో సత్తా చాటాడు. 2023లో న్యూజిలాండ్ పై తొలి సారి పాకిస్థాన్ తరపున అరంగేట్రం చేశాడు. అయితే ఆడిన ఈ ఒక్క మ్యాచ్ లో బ్యాటింగ్, బౌలింగ్ అవకాశం రాలేదు.

**2023 నుండి గులామ్ ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. 2023 నుంచి అతను 13 మ్యాచ్‌ల్లో ఏడు సెంచరీలతో 1,055 పరుగులు చేశాడు. యావరేజ్ 55 ఉంది. 2024 లో అతను 5 సెంచరీలు సాధించాడు. ఇటీవలే ఆగస్టులో బంగ్లాదేశ్ ఏ తో జరిగిన మ్యాచ్ లోనూ సెంచరీ కొట్టాడు. గులామ్ బ్యాటింగ్ తో పాటు పార్ట్ టైం బౌలర్ గా సత్తా చాటగలడు. ఇప్పటివరకు అతని ఫస్ట్‌క్లాస్ కెరీర్ లో 31 వికెట్లు ఉన్నాయి.**

ఈ మ్యాచ్ ప్లేయింగ్ 11 విషయానికి వస్తే బౌలింగ్ లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. నోమన్ అలీ, సాజిద్ ఖాన్, జాహిద్ మెహమూద్ తుది జట్టులో స్థానం సంపాదించారు. ఈ ముగ్గురు షహీన్ అఫ్రిది, నజీమ్ షా, అబ్రార్ అహ్మద్ స్థానంలో వచ్చారు. పాకిస్థాన్ ఆడిన చివరి ఆరు టెస్టుల్లో ఓడిపోయింది. వీటిలో స్వదేశంలో వరుసగా 3 మ్యాచ్ ల్లో పరాజయం పాలైంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ తో జరుగుతున్న మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో తొలి టెస్టులో ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఓటమి మూటకట్టుకుంది.

**ఇంగ్లండ్‌తో రెండో టెస్టుకు పాకిస్థాన్ ప్లేయింగ్ ఎలెవన్:**

సైమ్ అయూబ్, అబ్దుల్లా షఫీక్, షాన్ మసూద్ (కెప్టెన్), కమ్రాన్ గులామ్, సాద్ షకీల్ (వైస్ కెప్టెన్), మహ్మద్ రిజ్వాన్ (వికెట్ కీపర్), సల్మాన్ అలీ అఘా, అమీర్ జమాల్, నోమన్ అలీ, సాజిద్ ఖాన్, జాహిద్ మెహమూద్

# ఒమర్ అబ్దుల్లాను కలిసిన రవిశాస్త్రి

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ క్రికెటర్ రవిశాస్త్రి.. జమ్మూ కాశ్మీర్ తదుపరి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కలిశారు. సోమవారం లెజెండ్స్ క్రికెట్ లీగ్ ఫౌండర్, చైర్మన్ వివేక్ ఖుషాలానీతో కలిసి నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఇంటికెళ్లిన రవిశాస్త్రి.. ఆయనను మర్యాదపూర్వకంగా పలకరించారు. కాబోయే ముఖ్యమంత్రికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.





**కోరుకుంటున్న ఇండియన్ ఫ్యాన్స్**

సీనియర్ ఆటగాళ్లు తలపడే లెజెండ్స్ లీగ్ టోర్నీ జమ్మూ కాశ్మీర్ వేదికగా జరుగుతోంది. రెండ్రోజుల క్రితం ఈ టోర్నీ మ్యాచ్‌లు జరుగుతున్న శ్రీనగర్‌లోని బక్షి స్టేడియాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత సందర్శించారు. ఆటగాళ్లతో కాసేపు మాటామంతీ జరిపారు. క్రికెటర్లను సాదరంగా తమ ఇంటికి ఆహ్వానించారు. ఈ క్రమంలోనే రవిశాస్త్రి.. ఒమర్ అబ్దుల్లా ఇంటికెళ్లినట్లు తెలుస్తోంది.

**48 స్థానాల్లో కూటమి విజయం**

ఇటీవల ముగిసిన జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమి 48 స్థానాల్లో విజయం సాధించి అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఈ నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ వైస్ ప్రెసిడెంట్ ఒమర్ అబ్దుల్లా జమ్మూ కాశ్మీర్ తదుపరి ముఖ్యమంత్రి కానున్నారు.

# ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్.. లైవ్ స్ట్రీమింగ్ ఎందులో చూడాలంటే..?

**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్, భారత్ జట్ల మధ్య అక్టోబర్ 16 నుంచి మూడు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం తొలి టెస్ట్ కు ఆతిథ్యమిస్తుంది. అక్టోబర్ 24 నుంచి పూణే వేదికగా రెండో టెస్ట్.. నవంబర్ 1 నుంచి 5 వరకు ముంబై వాంఖడేలో చివరి టెస్ట్ ఆడనున్నాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (2023-25) లో భాగంగా ఇరు జట్లకు ఇది కీలక సిరీస్. ఈ సిరీస్ కోల్పోతే కివీస్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ నుంచి దాదాపుగా నిష్క్రమిస్తుంది. మరోవైపు భారత్ ఈ సిరీస్ ఓడితే భారత్ ఆస్ట్రేలియాపై బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఖచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. భారత్ తో జరగబోయే మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ కు న్యూజిలాండ్ క్రికెట్ తమ జట్టును ప్రకటించింది. ఈ సిరీస్‌కు టామ్ లాథమ్ తొలిసారిగా పూర్తిస్థాయి టెస్టు కెప్టెన్‌గా జట్టును నడిపించనున్నాడు. న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియంసన్ తొలి టెస్టుకు దూరం అయ్యాడు. గజ్జల్లో గాయం కారణంగా అతడు తొలి టెస్ట్ ఆడట్లేదు. బ్యాకప్ గా కేన్ స్థానంలో మార్క్ చాప్‌మన్‌ను స్క్వాడ్‌లో చేర్చారు.మరోవైపు సొంతగడ్డపై భారత్ జట్టును ప్రకటించింది. బంగ్లాదేశ్ తో ఆడిన జట్టుతోనే కివీస్ తో టెస్ట్ సిరీస్ ఆడనుంది.






**లైవ్ స్ట్రీమింగ్ ఎందులో చూడాలంటే..?**

ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్ ను స్పోర్ట్స్ 18, కలర్స్ సినీప్లెక్స్ టీవీ ఛానెల్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. వీటితో పాటు జియో సినిమా యాప్,వెబ్‌సైట్‌లో ఈ సిరీస్ చూడొచ్చు.

**టెస్ట్ సిరీస్ షెడ్యూల్**

తొలి టెస్ట్ (అక్టోబర్ 16- 20): చిన్నస్వామి స్టేడియం (బెంగళూరు)
రెండో టెస్ట్(అక్టోబర్ 24- 28): మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్, పూణె
మూడో టెస్ట్ (నవంబర్ 01- 05): వాంఖడే స్టేడియం (ముంబై)

**టెస్ట్ సిరీస్ కు న్యూజిలాండ్ జట్టు:**

టామ్ లాథమ్ (కెప్టెన్), టామ్ బ్లండెల్ (వికెట్ కీపర్), మైఖేల్ బ్రేస్‌వెల్ (తొలి టెస్టుకు మాత్రమే), మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, మాట్ హెన్రీ, డారిల్ మిచెల్, విల్ ఓ'రూర్క్, అజాజ్ పటేల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, మిచెల్ సాంట్నర్, బెన్ సియర్స్, ఇష్ సోధి (రెండు, మూడు టెస్టులకు)టిమ్ సౌథీ, కేన్ విలియమ్సన్, విల్ యంగ్

**టెస్ట్ సిరీస్ కు భారత జట్టు:**

రోహిత్ శర్మ (కెప్టెన్), జస్ప్రీత్ బుమ్రా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్

**ఈ షో-స్టాపింగ్ డ్రెస్‌లో తేజస్వి ప్రకాష్ వావ్**



# డింపుల్ హయాతి.. జలపాతంలో బికినీ అందం

**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ గ్లామర్ క్వీన్ డింపుల్ హయాతి మరోసారి తన ఫ్యాషన్ మరియు గ్లామర్ లుక్ తో సోషల్ మీడియా లో దుమ్ము రేపుతోంది. రెగ్యులర్ గా తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ ద్వారా అభిమానులతో ప్రత్యేక ఫోటోషూట్ పిక్స్ ను పంచుకుంటూ వారిని అలరిస్తున్న ఈ టాలెంటెడ్ బ్యూటీ, ఇప్పుడు తాజా ఫోటోషూట్ ద్వారా అందర్నీ ఆకట్టుకుంటోంది. తెలుగు అమ్మాయి అయిన డింపుల్ తన గ్లామర్ తో సినీ ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది. మొదట 'గల్ఫ్' అనే సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయినప్పటికీ, ఆ చిత్రం ఆశించిన విజయాన్ని ఇవ్వలేదు. తర్వాత 'అభినేత్రి 2'లో ప్రభుదేవా, తమన్నా కాంబినేషన్ లో కీలక పాత్రలో కనిపించినప్పటికీ, అది కూడా పెద్దగా విజయం సాధించలేదు. అయితే డింపుల్ హయాతికి బ్రేక్ ఇచ్చింది మాత్రం 'గద్దలకొండ గణేష్' సినిమా. ఆ సినిమాలో చేసిన ఐటెం సాంగ్ ఆమెకు మంచి పాపులారిటీ తెచ్చిపెట్టింది. ఈ సాంగ్ తో అందరికి



సుపరిచితమైన డింపుల్, తర్వాత 'యురేకా' మూవీలో హీరోయిన్ గా నటించింది. అలాగే మాస్ మహారాజా రవితేజతో 'ఖిలాడీ' చిత్రంలో హీరోయిన్ గా కనిపించి, తన గ్లామర్ తో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ సినిమాలో డింపుల్ బికినీ వేసుకొని అందరికి షాక్ ఇచ్చింది. ఈ లుక్ తో తన గ్లామర్ పాత్రలకు తాను సిద్ధమని స్పష్టంగా చెప్పింది. తాజాగా డింపుల్ హయాతి షేర్ చేసిన ఈ ఫోటోలో ఆమె ఒక అందమైన జలపాతం వద్ద సొగసైన బ్లాక్ బికినీ అవుట్‌ఫిట్ ధరించి కనిపించింది. ప్రకృతి మధ్యలో, నీటి ప్రవాహంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో డింపుల్ తన లుక్‌తో మరింత గ్లామర్ జోడించింది. %ూశ్రీంశీ =ముఃస% - ఆరేళ్లు.. నలుగురు స్టార్లు.. నీల్ లైనప్ వేరే లెవెల్! ఫోటోలో ఆమె అందం, లుక్స్ ని మేళవించడంతో సోషల్ మీడియాలో ఈ ఫోటోలు కాస్తా వైరల్‌గా మారాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు 55,000 మందికి పైగా లైక్స్ అందుకున్న ఈ ఫోటోకు నెటిజన్లు ఫిదా అవుతూ తమ అభిప్రాయాలను కామెంట్స్ రూపంలో తెలియజేస్తున్నారు. "డింపుల్ కళ్ళలోనే గ్లామర్ ఉంది" అని కొంతమంది నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. పాత్రలోనూ, వాస్తవ జీవితంలోనూ తన గ్లామర్ ను ఎలా ప్రదర్శించాలో డింపుల్ కు బాగా తెలుసు. కెరీర్ లో వరుసగా ప్రాజెక్టులు చేస్తూ, తన గ్లామర్ తో అభిమానులని ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటోంది. ఇటీవల డింపుల్ హయాతి గోపిచంద్ సరసన 'రామబాణం' సినిమాలో నటించినా, ఆ చిత్రం కమర్షియల్ గా పెద్దగా విజయం సాధించలేదు. అయినప్పటికీ, డింపుల్ తన గ్లామర్ తో ఎప్పటికప్పుడు ఆడియెన్స్ దృష్టిని ఆకర్షిస్తోంది.

**రష్మీ గౌతమ్ లుక్ అంతా టైమ్‌లెస్ స్టైల్‌కి సంబంధించినది**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com